క్లుప్తంగా

మందిరానికి రూ.లక్ష విరాళం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్ద తండాల్లో జై భవానిమాత, జై సేవాలాల్ మందిరాలకు ప్రముఖ హైకోర్టు న్యాయవాది మోహిన్ హమ్మద్ ఖాద్రి సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా తండావాసులు న్యాయవాదికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తండా పెద్దలు పాల్గొన్నారు.

సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి..



భిక్కనూరు: దక్షిణకాశీగా పేరొందిన భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన న్యాయవాది గజ్జెల భిక్షపతి–శ్రీవాణిల కుమార్తె గజ్జెల శ్రీలేఖ రూ.18వేలను సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దరామేశ్వరస్వామి ఆశీస్సుల వల్లనే తనకు ఉద్యోగం వచ్చిందన్నారు. ఆలయ ఈవో శ్రీధర్ విరాళ దాత కుటుంబీకులను సన్మానించారు. అర్చకులు సిద్దగిరిశర్మ, రామగిరిశర్మ, రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

ఫంక్షన్ హాలు పనులు ప్రారంభం



బీబీపేట: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ఫంక్షన్ హాలు పనులను సోమవారం స్థానిక బీజేపీ నాయకులు, సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి గతంలో సంఘం సభ్యులకు ఇచ్చిన హామీ మేరకు సొంతంగా పనులకు కావల్సిన మెటీరియల్‌ను అందజేసినట్లుగా సంఘం సభ్యులు తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో టాపర్‌గా నిలిచిన ఐశ్వర్య



కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ తెలంగాణ సారస్వత్ పరిషత్ ఆధ్వర్యంలో నేషనల్ ప్రీమియం వార్స్–2025కు సంబంధించి ఆరో సీజన్ డ్యాన్స్ పోటీల్లో స్థానిక కాకతీయ నగర్ మౌంట్ కార్మెల్ పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థి ఆర్.ఐశ్వర్య టాపర్‌గా నిలిచింది. టాపర్‌గా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఐశ్వర కుటుంబ సభ్యులు ఆర్.సుధాకర్, కృష్ణవేణిలు సంతోషం వ్యక్తం చేశారు.

వాహనాల తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై సోమవారం వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి, సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. అలాగే పెండింగ్ చలానాలు కట్టించారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన బ్లూబెల్స్ స్కూల్ విద్యార్థినులు



పిట్లం(జుక్కల్): కామారెడ్డి జిల్లా కేంద్రంలో విశ్వం ఎడ్యుటెక్ వారు నిర్వహించిన జోనల్ లెవల్ అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేదిక్ మ్యాథ్స్‌లో నలుగురు విద్యార్థినులు విజయలక్ష్మి, వెన్నెల, అక్షిత, కుషి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరిలో హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. అబాకస్‌లో కైఫ్, అశ్విత్, వేదిక్ మ్యాథ్స్‌లో సుస్రుత, సాయిశ్రీ, మధులిక, శ్రీవల్లభ్‌లు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, సిబ్బంది అభినందించారు.

ఘనంగా భోగి పండుగ

జిల్లాలో సోమవారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. అనంతరం ఆ ప్రాంతంలో మహిళలు ముగ్గులు వేశారు. ఆ తర్వాత కొత్త బట్టలు ధరించి యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి ఆనందంగా గడిపారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి పెద్దలు ఆశీర్వదించారు.

– సాక్షి నెట్‌వర్క్



జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో భోగి మంటలు వేస్తున్న స్థానికులు



నస్రుల్లాబాద్‌లో గాలి పటాలు ఎగురేస్తున్న చిన్నారులు



మాగి గాయత్రి కార్మాగారంలో..



జిల్లా కేంద్రంలో చిన్నారులపై భోగి పండ్లు పోస్తూ..



భిక్కనూరులో ముగ్గు వేస్తున్న చిన్నారి శ్రీవింధ్య



కామారెడ్డిటౌన్: విద్యానగర్ కాలనీలో..

అభివృద్ధిలో 'పోచారం' రాజీపడరు

బాన్సువాడ: నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎవరితోనూ రాజీ పడరని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం వారు బాన్సువాడలో మాట్లాడారు. బాన్సువాడలో పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసమే పోచారం కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సే అని, కేసీఆర్ వల్లనో, బీఆర్ఎస్ పార్టీ వల్లనో తెలంగాణ రాలేదని అన్నారు. ప్రజల కుసేవ చేయడమే లక్ష్యంగా పోచారం పని చేస్తున్నారని అన్నారు. నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఖలేక్, జంగం గంగాధర్, నార్ల సురేష్, నార్ల రవీందర్, ఎజాస్, గోపాల్‌రెడ్డి, మోహన్‌నాయక్, దాసరి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



బాన్సువాడలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అ'పూర్వ'సమ్మేళనం



1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

భిక్కనూరు: జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997–98 పదో తరగతి విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమకు చదువులు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 27 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. వచ్చే ఏడాది కుటుంబీకులతో కలిసి కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అలాగే తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పాటుపడుతామన్నారు.

వెలసిన గాలిపటాలు, రంగుల దుకాణాలు



ఎల్లారెడ్డిలో వెలసిన గాలిపటాల దుకాణాలు



రంగులు కొనుగోలు చేస్తున్న యువకుడు

ఎల్లారెడ్డిరూరల్/కామారెడ్డిటౌన్: జిల్లాలో సంక్రాంతి సంబురాలు జోరందుకున్నాయి. ఈ సందర్భంగా రంగుల దుకాణాలు కొత్తగా వెలిశాయి. మహిళలు రంగులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబర్చారు. సంక్రాంతి నేపథ్యంలో జిల్లాలో మార్కెట్లు కళకళలాడాయి.



జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్డులో..



జిల్లా కేంద్రంలో గాలిపటాల విక్రయం

వైభవంగా గోదాదేవి, రంగనాయక స్వామి కల్యాణం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా వైష్ణవ ఆలయాల్లో సోమవారం గోదాదేవి, రంగనాయక స్వామిల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్ తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించిన కల్యాణానికి ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు కుటుంబసభ్యులు హాజరయ్యారు.



తిమ్మాపూర్ టీటీడీలో పల్లకీసేవలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి



తిప్పాపూర్‌లో..



బీబీపేటలో ..



దోమకొండలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ..



జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ..

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్ గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగారెడ్డి అవగాహన కల్పించారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాములు, రవి, శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పరిచయం చేసుకుంటున్న ఎస్సై సుధాకర్

లింగంపేట(ఎల్లారెడ్డి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని లింగంపేట ఎస్సై సుధాకర్ అన్నారు. సోమవారం ఆయన ముస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రోజు క్రీడలు ఆడడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. యువకులు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి ఏడాది ముస్తాపూర్ యువకులు క్రీడా పోటీలు నిర్వహించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. ఆర్గనైజర్లు నరేష్, అరవింద్, భువర్దన్, మహేష్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

గోపాల్‌పేటలో స్తంభించిన ట్రాఫిక్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో సోమవారం ట్రాఫిక్ స్తంభించింది. గోపాల్‌పేటలో వారాంతపుసంత సందర్భంగా సంతకు వచ్చిన వారు ప్రధాన రహదారికి ఇరువైపులా భారీగా ద్విచక్ర వాహనాలను నిలిపారు. దీంతోపాటు మండలకేంద్రంలో జాతీయ రహదారి ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో బస్సులు, లారీలతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సుమారు అర కిలోమీటర్ మేర ట్రాఫిక్ స్తంభించింది.

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న అంబేద్కర్ సంఘం నేతలు

బాన్సువాడ రూరల్: మెదక్ జిల్లా రామాంతపూర్‌లో మతిస్థిమితం లేని మహిళపై గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడిన నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బోర్లం గ్రామ అంబేడ్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టి మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు నల్లోల సాయిలు, ప్రధాన కార్యదర్శి మన్నె అనిల్ కుమార్, సభ్యులు దిలిప్, ఆనంద్, సిద్దు, శివ, సాయికుమార్ పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్సై మహేందర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యాపారులతో సమావేశమై అన్ని వ్యాపార సముదాయాలలో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అనంతరం కెనరా బ్యాంక్ ఆవరణలో సీసీ కెమెరాలు, ఏటీఎంను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది వెంకట్, రవి, బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఆయుష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం మెట్టు చిన్న స్వామి జ్ఞాపకార్థం తాడ్వాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఎనిమిది జట్లు పాల్గొన్నాయి.

తలసేమియా వ్యాధి బాధితుల కోసం రక్తదానం

కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధి బాధితుల కోసం కాపర్తి నాగరాజు తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం రక్తదానం చేసినట్టు రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్త ఎస్.బాలు తెలిపారు. నాగరాజు రక్తదానం చేయడానికి ముందుకు రావడంతో రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్, బాలు, గంప ప్రసాద్, జమీల్ హైమద్, చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

బాన్సువాడ రూరల్: రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ ఎస్సై తాజుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన కోనాపూర్‌లో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అపరిచిన వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని, ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. డిజిటల్ పేమెంట్స్, ఏటీఎం వాడకం, బీమా పథకాల గురించి వివరించారు. అనంతరం ఆర్‌బీఐ వారి 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కౌన్సిలర్లు బాలకృష్ణ, పర్వయ్య, అనుదీప్, ఐకేపీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎస్సై తాజుద్దీన్

సమాచారం..

నేడు అయ్యప్ప ఆలయంలో జ్యోతి దర్శనం



బాన్సువాడ: కేరళలోని పుణ్యక్షేత్రం శబరిమలలో జరిగే కార్యక్రమాలు మంగళవారం బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో నిర్వహిస్తామని గురుస్వాములు శంకర్, గురువినయ్‌లు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అయ్యప్పస్వామికి నెయ్యితో అభిషేకం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అభరణాలతో ఊరేగింపు, ఆలయంలో స్క్రీన్‌పై జ్యోతి దర్శనం ఉంటుందని వారు అన్నారు.

నాగన్నగారి మెట్ల బావి వద్ద ముగ్గుల పోటీలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావి ఆవరణలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. మొదటి విజేతకు 5 తులాల వెండి, ద్వితీయ బహుమతి 3 తులాల వెండి, తృతీయ బహుమతి 2 తులాల వెండి, 4వ బహుమతి రైస్ కుక్కర్, 5వ బహుమతి పప్పుకుక్కర్ అందజేస్తామన్నారు. ఎవరి ముగ్గు రంగులు వారే వెంట తెచ్చుకోవాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు.

16న ఉచిత వైద్య శిబిరం



దోమకొండ: అంచనూరులో ఈనెల 16న హార్వెస్ట్ మినిస్ట్రీస్ ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రత్నాకర్ తెలిపారు. సోమవారం ఉచిత వైద్య శిబిరానికి సంబంధించి కరపత్రాలు, బ్యానర్లను మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్, సింగిల్ విండో చైర్మన్ నాగరాజు రెడ్డి తదితరుల చేతుల మీదుగా విడుదల చేశారు. మాజీ సర్పంచ్ నల్లపు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, తదితరులున్నారు.

సంక్షిప్తం

బోరు మోటారు ప్రారంభం



కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని 36వ వార్డులో నూతన బోరు మోటారును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సోమవారం ప్రారంభించారు. వార్డులో నీటి సమస్యను తీర్చేందుకు మున్సిపల్ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. వార్డు కౌన్సిలర్ పంపరి లత, నాయకులు శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో బోరుబావి తవ్వకం



ఎల్లారెడ్డి: తిమ్మాపూర్‌లో నీటి ఎద్దడి నివారణకు సోమవారం బోరు బావిని తవ్వించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ సూచన మేరకు గ్రామంలో బోరుబావిని తవ్వించినట్లు వారు తెలిపారు. నాయకులు వెంకట్రాంరెడ్డి, కుడుముల సత్యనారాయణ, బోండ్ల సాయిలు, సామెల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, రవీందర్ తదితరులున్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం నాటికి 2 లక్షల 12 వేల 48 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు బడిబయటి పిల్లల గుర్తింపు



కామారెడ్డి రూరల్: పాతరాజంపేట శివారులో గల షబ్బీర్ అలీ కాలనీలో సోమవారం బడి బయట సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా బడికి వెళ్లని ఇద్దరిని గుర్తించి వారి ఆధార్‌కార్డులు సేకరించారు. పాఠశాలలు ప్రారంభం కాగానే పంపిస్తామని పిల్లల తల్లిదండ్రులు చెప్పినట్లు ఉపాధ్యాయుడు రవి, సీఆర్‌పీ చిరంజీవిలు తెలిపారు.

కల్కి ఆలయంలో అన్నదానం

కామారెడ్డి అర్బన్: పరంజ్యోతి కల్కి అమ్మభగవాన్ ఆలయం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక పాతబస్టాండ్‌లో 500 మందికి అన్నదానం నిర్వహించారు. పౌర్ణమి రోజు అన్నదానం వంశాభివృద్ధి, కుటుంబ సంక్షేమం కల్గుతుందని ఆలయ నిర్వాహకులు ఎర్రం చంద్రశేఖర్ అన్నారు. సిద్దంశెట్టి శ్రీనివాస్, గౌరిశెట్టి నాగేశ్వరరావు, డి.శ్రీనివాస్, మామిడి రాకేష్, పిప్పిరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.